'సీవోఈ' ప్రోత్సాహకాలకు తిలోదకాలు!

- మెడికల్ సీట్లు సాధించిన వారికి రూ.50 వేలు
- ఇంజినీరింగ్ సీట్లు పొందినవారికి ల్యాప్‌టాప్‌లు
- ప్రతిపేటా అందిస్తూ వస్తున్న సోషల్ వెల్ఫేర్ సొసైటీ
- ఈ ఏడాది ఇప్పటికీ ఆ ఊసే ఎత్తని కాంగ్రెస్ సర్కారు

హైదరాబాద్, డిసెంబర్6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలోని సీవోఈ(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)ల్లో ఇప్పటివరకు ఏటా ఆనవాయితీగా అందిస్తూ వచ్చిన నగదు ప్రోత్సాహకాలకు ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చినట్టుగా తెలుస్తున్నది. ఈ ఏడాది ర్యాంకులు సాధించినవారికే కాకుండా, గతేడాది ర్యాంకులు పొందిన విద్యార్థులకు సంబంధించిన ప్రతిపాదనలను సైతం ప్రభుత్వం పక్కనపెట్టడం అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఎంతో కష్టపడి అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటూ ప్రతిష్టాత్మకమైన సంస్థల్లో మెడికల్, ఇంజినీరింగ్ సీట్లను సాధించిన నిరుపేద విద్యార్థులు వాటి కోసం ఎదురుచూస్తున్నారు.

38 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు..

ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్ తదితర జాతీయస్థాయి పరీక్షల్లో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇచ్చేందుకు సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలో ప్రత్యేకంగా 20 బాలికలకు, 17 బాలురకు, 1 కోఎడ్యుకేషన్ కలిపి మొత్తం 38 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) కేంద్రాలను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. వీటిలో బాలికలకు 2000, బాలురకు 1680 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు వీటి నుంచి దాదాపు 1000 మందికి పైగా విద్యార్థులు ఎంబీబీఎస్‌తోపాటు నిట్, ఐఐటీల్లో సీట్లు సాధించారు. ఇలా సీట్లు సాధించిన వారికి సొసైటీ ప్రతి సంవత్సరం నగదు ప్రోత్సాహకాలు అందిస్తూ వస్తున్నది. మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు రూ.50 వేలు, ఇంజినీరింగ్ సీట్లు పొందిన వారికి ల్యాప్‌టాప్‌లు అందిస్తూ వస్తున్నది. గిరిజన విద్యాసంస్థల సొసైటీ ఈ ఏడాది అందుకు సంబంధించిన పురస్కారాలను ఇటీవలే అందజేసింది. సోషల్‌వెల్ఫేర్ సొసైటీ మాత్రం ఇప్పటికీ ప్రోత్సాహకాలను అందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. గతేడాది సోషల్ వెల్ఫేర్ సొసైటీ నుంచి 150 మంది మెడికల్ సీట్లు, 130 మంది ఇంజినీరింగ్ సీట్లు సాధించారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను గతేడాది అక్టోబర్‌లోనే సిద్ధం చేశారు. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రోత్సాహకాలను అందివ్వలేదు.

ఈ ఏడాది 174 మెడికల్ సీట్లు..

2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది నీట్ అడ్మిషన్లలో ఎస్సీ గురుకుల సొసైటీ విద్యార్థులు సత్తాచాటి 174 మంది సీట్లను కైవసం చేసుకున్నారు. దాదాపు 130 మంది ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు పొందినట్టు తెలుస్తున్నది. వీరికి ప్రోత్సాహకాలు అందివ్వాల్సి ఉండగా, ఇప్పటికీ ప్రతిపాదనలు సిద్ధం చేయలేదని సొసైటీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. గతేడాది ప్రతిపాదనలను పక్కనపెట్టడం, ఈ ఏడాదికి సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేయకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహకాలను అందించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

తిరుమలలో అన్యమత వస్తువులు

- 'అన్యమత కడియం' విక్రయం.. షాక్‌కు గురైన భక్తుడు
- టీటీడీ చైర్మన్‌కు ఫిర్యాదు.. దుకాణం మూసివేత

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): తిరుమలలో అన్యమత గుర్తు కలకలం రేపింది.హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తిరుమలేశుని దర్శనానికి వెళ్లింది. ఈ నేపథ్యంలో తిరుమల సీఆర్‌వో కార్యాలయం ఎదుట ఓ దుకాణంలో చేతికి ధరించే కడియాన్ని కొనుగోలు చేశారు. రూమ్‌కు వెళ్లి ఆ కడియాన్ని పరిశీలించగా దానిపై అన్యమతానికి సంబంధించిన పేరు, సింబల్‌ను గుర్తించారు. దీంతో కంగుతిన్న ఆ భక్తులు విషయాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన అధికారులు సంబంధిత దుకాణంలో తనిఖీలు చేపట్టారు. అలాంటి వస్తువులను విక్రయిస్తున్నట్టు గుర్తించి దుకాణాన్ని మూసివేయించారు. కాగా, బాధిత దుకాణదారుడు మాత్రం తాము విక్రయించిన వస్తువులపై అన్యమత గుర్తులు ఉన్నట్టు తమకు తెలియదని అధికారులకు వివరించాడు. మరోవైపు ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

జీహెచ్‌ఎంసీలో సర్వే 10 శాతమే

గ్రామీణ ప్రాంతాల్లో 95-98 శాతం

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గత నెల 6న ప్రారంభించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులాలవారీగా కుటుంబ సర్వే జీహెచ్ ఎంసీ పరిధిలో పది శాతం కూడా కాలేదని అధికారులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 95 నుంచి 98 శాతం వరకు పూర్తయ్యినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సగటున 76శాతం సర్వే చేసినట్టు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో సేకరించిన సర్వే వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నామని, ఈ నెల 9లోగా కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. 94 వేల మంది ఎన్యూమరేటర్లు, 9వేల మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాలుపంచుకున్నారని తెలిపారు.